క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

జాతీయ థాంగ్ టా పోటీలకు అశ్విన్



థాంగ్–టా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన అశ్విన్‌తో ప్రిన్సిపాల్ వసంతిదేవి

పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ థాంగ్–టా టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం సాధించిన దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్‌కు విద్యార్థి అశ్విన్ ఆషిస్(9వ తరగతి) జాతీయ థాంగ్–టా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వసంతిదేవి తెలిపారు. ఈ నెల మణిపూర్‌లో జరగనున్న జాతీయ పోటీల్లో ఆశ్విన్ ఆషిస్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. జాతీయ టోర్నీలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీటీ షెల్టన్‌జేమ్స్ పాల్గొన్నారు.

అప్పన్న రథాన్ని పరిశీలించిన ఇంజినీర్లు



రథాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ విద్యాసాగర్ తదితరులు

సింహాచలం: ఈ నెల 8న చైత్రశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రథోత్సవంలో వినియోగించే రథాన్ని ఆర్ అండ్ బీ ఇంజినీర్లు గురువారం పరిశీలించారు. ఏటా జరిగే స్వామివారి రథోత్సవానికి ముందు రథాన్ని పరిశీలించి ఫిట్‌గా ఉందో లేదో తనిఖీ చేస్తారు. ఈ నేపథ్యంలో ఆర్ అండ్ బీ ఈఈ విద్యాసాగర్, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈ పాండు రంగారావు సింహగిరికి వచ్చి రథాన్ని తనిఖీ చేశారు. రథ చక్రాలు, రంథంలోని జాకీ తదితరాలను పరిశీలించారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: వెంకటాపురం, దారపాలెం ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, దారపాలెం, వెంకటాపురం, ఆర్‌ఆర్ వెంకటాపురం ,ఎస్సీ, బీసీ కాలనీ, అజంతాపార్క్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

సబ్బవరం: స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీలో ఎయిర్ ఫోర్స్, ఇండియన్ నేవీ, ఆర్మీలో ఇంటర్ అర్హత కలిగిన నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు అకాడమీ చైర్మన్ పోతల సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిసర ప్రాంతాల్లోని ఆసక్తి, అర్హత కలిగిన నిరుపేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం 99120 22474, 70134 56140 నంబర్లలో సంప్రదించాల్సిందిగా సూచించారు.



ప్రశాంతంగా ఉండే పెందుర్తి శివారులో అడపాదడపా ఆర్థిక నేరాలు, దొంగతనాలు పరిపాటిగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక భౌతిక దాడులు, అత్యాచారాలతో శివారు ప్రాంతం తరచూ వార్తల్లో నిలుస్తోంది. ఇప్పుడు ఆ స్థాయిని కూడా దాటింది. ఊహించని ఘటనలకు నిలయంగా మారింది. పెందుర్తి శివారులో మత్తు పదార్థాల వాసన గుప్పుమంటోంది. **ఇటీవలి కాలంలో దొరికిన వందలు, వేల కిలోల గంజాయి, ఇతర మత్తు పదార్థాలే ఇందుకు నిదర్శనం.**



రెండు రోజుల క్రితం పెందుర్తి మండలం రాజయ్యపేట వద్ద భారీగా పట్టుబడ్డ గంజాయి

పెందుర్తి మీదుగా.. గంజాయ్!

ఆనందపురం–అనకాపల్లి బైపాస్, విశాఖ–అరకు రహదారిపై అక్రమ రవాణా

ఇటీవల కాలంలో భారీగా పట్టుబడుతున్న గంజాయి, మత్తు పదార్థాలు

స్మగ్లర్లకు నెలవుగా మారుతున్న పెందుర్తి, సబ్బవరం జనావాసాలు

పెందుర్తి: పట్టణ శివారులో ఆనందపురం–అనకాపల్లి బైపాస్, అరకు–విశాఖపట్నం రహదారుల మీదుగా గంజాయి, గుట్కా, ఇతర నిషేధిత మత్తు పదార్థాల రవాణా కలకలం రేపుతుంది. ఏడాది కాలంలో పదుల సంఖ్యలో గంజాయి రవాణా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో పెందుర్తి పరిధిలో వాహన తనిఖీలు ముమ్మరమయ్యాయి. రెండు రోజుల క్రితం రూ.10 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అంతకు వారం రోజుల ముందు సబ్బవరంలో 380 కిలోల గంజాయి పట్టబడింది. జనావాసాల్లోని పార్కులు, శిథిల భవనాల్లో మత్తు పదార్థాలు సేవిస్తూ, దాడులకు దిగుతున్న వారి సంఖ్య కూడా పెరిగింది. దీంతో పెందుర్తి పరిధిలోని రోడ్లపై నిఘా పెరిగింది.

ఇటీవల ఘటనల్లో కొన్ని..

- రెండు రోజుల క్రితం పెందుర్తిలో రూ.10 లక్షల విలువైన 180 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.
- పది రోజుల క్రితం సబ్బవరంలో రూ.50 లక్షలకు పైగా విలువైన 380 కిలోల గంజాయి పట్టుబడింది.
- గత ఏడాది కాలంలో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 42 గంజాయి కేసుల్లో 120 మందిని పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 4 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.
- సబ్బవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 7 కేసుల్లో 40 మందిని పట్టుకుని, వారి నుంచి 2 వేల కిలోల గంజాయిని సీజ్ చేశారు.

అక్రమ రవాణాకు సులభ మార్గం

ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారి(బైపాస్) పెందుర్తి నుంచి వెళ్లడం గంజాయితోపాటు ఇతర అక్రమ రవాణాలకు కూడా సులభ మార్గంగా మారింది. ఈ రోడ్డు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలకు కలవడంతో మత్తు పదార్థాల అక్రమ రవాణాదారులు పట్టణ శివారు ప్రాంతాలను తమ కార్యకలాపాలకు ఆవాసాలుగా వాడుకుంటున్నారు. ముఖ్యంగా గంజాయిని ఏజెన్సీ నుంచి పెందుర్తి, సబ్బవరం ప్రాంతాలకు తీసుకువచ్చి, ఇక్కడ తూకాలు వేసి స్మగ్లర్లు రవాణా చేస్తున్నారు. ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచే గంజాయి తరలిస్తున్నట్లు ఇటీవలి సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్న ఈ రహదారిపై తనిఖీలు జరుగుతున్నా స్మగ్లర్లు అధికారులను బురిడీ కొట్టించి సరకును తరలించుకుపోతున్నారు. ఇందుకు పర్యాటక శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల స్టిక్కర్లు వాహనాలపై అతికిస్తుండడం గమనార్హం. అప్పుడప్పుడూ అంబులెన్స్‌ల్లో సైరన్‌లు వేసి గంజాయి తరలిస్తూ పట్టుబడిన దాఖలాలూ ఉన్నాయి.

నివాసాల మధ్యలోనే..

పెందుర్తి ప్రాంతంలో సుజాతనగర్ పూర్తిగా క్లాస్ ఏరియా. కానీ ఇక్కడ మూడేళ్ల క్రితం జరిగిన దాడిలో ఓ ఇంట్లో 410 కిలోల గంజాయి దొరికింది. రెండేళ్ల క్రితం పెందుర్తి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో గాంధీనగర్‌లోని ఓ ఇంట్లో గంజాయితో పాటు నలుగురు తమిళ స్మగ్లర్లు, ఇద్దరు ఏజెన్సీ వాసులు పట్టుబడ్డారు. ఆ తరువాత పలుమార్లు స్మగ్లర్లు పట్టుబడ్డ ఘటనలు చోటుచేసుకున్నాయి. గత ఏడాది కాలంలో పెందుర్తి పరిసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న గంజాయిని పోలీసులు పట్టుకున్న కేసులు చాలా ఉన్నాయి. ఆయా ఇళ్లల్లో దొరికిన వారు దీర్ఘకాలికంగా అద్దెకు ఉండడం చూస్తుంటే ఎన్ని లక్షల కిలోల గంజాయి ఇక్కడి నుంచి సరఫరా చేసి ఉంటారో తెలుసుకోవచ్చు. ఇక ఇతర మత్తు పదార్థాల నిల్వ కోసం రహదారికి ఆనుకుని ఉన్న గొడౌన్లను అద్దెలకు తీసుకుని మరీ దందా చేస్తున్నట్లు సమాచారం. ఆనందపురం, పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో గొడౌన్లను అక్రమ వ్యాపారులు తమ స్థావరాలుగా చేసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై పోలీసు ఉన్నతాధికారులు గట్టి నిఘా వేసి గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, వినియోగానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.



పది రోజుల క్రితం సబ్బవరంలో పట్టుబడ్డ గంజాయి

నిరంతర నిఘా ఉంచుతున్నాం



గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా మీద గట్టి నిఘా ఉంచుతున్నాం. ముఖ్యంగా రవాణాకు అనుగుణంగా ఉండే రోడ్లపై మా సిబ్బంది నిరంతరం గస్తీ కాస్తున్నారు. ఇక స్థావరాల విషయం మా దృష్టికి రాలేదు. ప్రజలు తమ ప్రాంతంలో అనుమానస్పదంగా ఎవరైనా ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే మాకు సమాచారం అందించాలి. ఎట్టి పరిస్థితిలోనూ గంజాయి రవాణా మా పరిధిలో జరగకుండా అడ్డుకట్ట వేస్తాం. సమాచారం, ఫిర్యాదు కోసం ఫోన్:112(హెల్ప్‌లైన్), ఎస్‌హెచ్‌వో: 94407 96039 నెంబర్లలో సంప్రదించవచ్చు.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

వైభవం.. నూకాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు పాపయ్యరాజుపాలెం సమీపంలోని భవానినగర్‌లో పునర్నిర్మించిన నూకాలమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు, పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో దాదాపు 5 వేల మంది ప్రసాదం స్వీకరించారు. సాయంత్రం భజనలు, కోలాటాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర అయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నేత గండి రవి, ఆలయ కమిటీ ప్రతినిధులు, వేలాదిగా ప్రజలు దర్శించుకున్నారు.

దేవాలయాలు కేంద్రంగా వసంత నవరాత్రులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాగపేర్రాజు, తదితరులు

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో సీతారాముల దేవాలయం కేంద్రంగా వసంత నవరాత్రుల కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ మండల సబ్ డివిజన్ కన్వీనర్ ఎం.నాగపేర్రాజు పిలుపునిచ్చారు. పరవాడ జంక్షన్‌లో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో ఫౌండేషన్ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి పంచాయతీలో దేవాలయం కేంద్రంగా భజన, సత్సంగం, సామూహిక హారతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టాలని సభ్యులకు సూచించారు. మండల సబ్ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ ఆర్కే బీచ్‌లో ఈ నెల 12న నిర్వహించనున్న హనుమాన్ జయంతి కార్యక్రమంలో సభ్యులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మండల సహాయ కన్వీనర్ బొద్దపు నూకరత్నం, జి.ఎరుకునాయుడు, కె.ఆదినారాయణ, హరిబాబు, అప్పలనాయుడు, సతీష్ పాల్గొన్నారు.

తల్లిని వెతుక్కుంటూ వెళ్లి తప్పిపోయిన చిన్నారి

- పరవాడ పోలీసుల చొరవతో గంటల వ్యవధిలోనే దొరికిన వైనం




చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ: అంగన్‌వాడీ విధులకు వెళ్లిన తల్లిని వెతుక్కుంటూ ఇంటి నుంచి బయటకు వచ్చి, తప్పిపోయిన ఓ చిన్నారిని అతి తక్కువ సమయంలోనే పరవాడ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలు.. స్థానిక పోలీసు స్టేషన్‌కు ఆమడ దూరంలోని గొర్లివానిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో నివసిస్తున్న జి.నూకరాజు, రాజేశ్వరి దంపతులు నివసిస్తున్నారు. వీరి కుమార్తె జి.కుసుమశ్రీ(5) గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అదృశ్యమైంది. తండ్రి ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తుంది. తల్లి మధ్యాహ్నం 2 గంటల సమయంలో అంగన్‌వాడీ విధుల నిర్వహణకు వెళ్లింది. ఆ సమయంలో చిన్నారి కుసుమశ్రీ తన తల్లిని వెతుక్కుంటూ బయటకు వచ్చి, కనిపించకుండా పోయింది. చిన్నారి ఆచూకీ కోసం తల్లిదండ్రులు పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో పరవాడ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సీఐ ఆర్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ఎస్‌ఐలు బి.కృష్ణారావు, జి.ఎస్.వి.మహాలక్ష్మి, పి.ప్రసాదరావులు తన సిబ్బందితో పరిసర ప్రాంతాలను జల్లెడపట్టారు. 3 గంటల అన్వేషణ తర్వాత దిబ్బల గొర్లివానిపాలెం సమీపంలో చిన్నారి ఆచూకీని కనుగొని, తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. పోలీసులకు నూకరాజు దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని తప్పిపోయిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ మల్లికార్జునరావు సూచించారు.

నేరాల నియంత్రణకు 'డ్రోన్' నిఘా

- పెందుర్తి పోలీసుల వినూత్న ప్రయోగం





వేపగుంట ప్రాంతంలో డ్రోన్‌లతో నిఘా పెడుతున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకుంటున్న నేరాలు, ఆకతాయిల ఆగడాలను నియంత్రించేందుకు పోలీసులు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని నిర్జన ప్రాంతాలు, నిర్మాణంలో ఉన్న భవనాలు, లేఅవుట్‌లలో నిఘా కోసం డ్రోన్‌లను ప్రయోగిస్తున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో వేపగుంట పద్మనాభనగర్ టిడ్కో ఇళ్ల ప్రాంతంలో డ్రోన్లతో నిఘా పెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో పేకాట, మద్యపానం, గంజాయి సేవనం, ఇతర అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా తమకు సహకరించాల్సిందిగా కోరారు. తమ నివాస సముదాయాలు, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా కంట్రోల్ రూమ్ నెం.112, 96767 97314 ఫోన్ నంబర్లలో సమాచారం అందించవచ్చన్నారు. అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కాంట్రాక్ట్ కార్మికురాలి మృతితో ఆందోళన



భవాని (ఫైల్)

కూర్మన్నపాలెం: జీవీఎంసీ కాంట్రాక్ట్ కార్మికురాలు మృతి చెందింది. దీంతో ఆ కుటుంబానికి న్యాయం చేయాలని సహచర కార్మికులు గురువారం ఆందోళనకు దిగారు. వివరాలిలా.. వడ్లపూడి కణితి హైస్కూలు సమీపంలో నివాసముంటున్న పాకం గంగాభవాని(45) విధి నిర్వహణలో ఉండగా బుధవారం మధ్యాహ్నం సొమ్మసిల్లి పడిపోయింది. సమీపంలో ఉన్న కార్మికులు ఆమెను కూర్మన్నపాలెంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఇంటికి తరలించిన కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగులు ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ వాటర్ ట్యాంక్ సమీపంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్, కుటుంబ సభ్యులు, దుర్గా కన్స్టెటిన్సీ యాజమాన్యంతో చర్చించారు. రూ. 2.50 లక్షలు పరిహారం ఇవ్వడానికి, భవాని కుమారుడికి ఆ సంస్థలో ఉపాధి కల్పించడానికి అంగీకరించారు. అనంతరం కార్మికులు ఆందోళన విరమించి మృతదేహాన్ని అంతిమ క్రియలకు తరలించారు.

కార్పొరేషన్ రుణాలకు పోటెత్తిన దరఖాస్తుదారులు



బీసీ కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూల కోసం వచ్చిన దరఖాస్తుదారులు



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న బ్యాంకు అధికారులు

సబ్బవరం: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తుదారులు తరలివచ్చారు. వివిధ కార్పొరేషన్ రుణాలకు మండల పరిషత్ అధికారులు, బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు జరిపారు. మండలంలోని 24 పంచాయతీల నుంచి 892 మంది అభ్యర్థులు ఇందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, బ్యాంకు ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంకు, గ్రామీణ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గుల్లేపల్లిలోని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. దరఖాస్తుదారుల్లో 740 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు మండల పరిషత్ అధికారి శివరామకృష్ణ తెలిపారు. దరఖాస్తుదారుల ధ్రువపత్రాలను పరిశీలించి, త్వరలోనే అర్హులైన అభ్యర్థుల జాబితాలను పంచాయతీల వారీగా ప్రకటిస్తామని పేర్కొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు నేడు

పరవాడ: మండలంలో వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ల నుంచి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 4న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.ధర్మారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో ఈ రుణాల కోసం 308 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీరిలో 114 మందిని ఎంపిక చేయనున్నారు. వివిధ బ్యాంకుల మేనేజర్లు, కార్పొరేషన్ల అధికారులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకు రావాలని ఎంపీడీవో సూచించారు.

పెంటమాంబ ఉత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ పంచాయతీ, నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పెంటమాంబ అమ్మవారి ఉత్సవాలకు బుధవారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఈ నెల 14న అమ్మవారి పండగను నిర్వహించనున్న నేపథ్యంలో దుర్గాలమ్మ అమ్మవారి ఘటాలకు పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ నెల 13 వరకూ అమ్మవార్ల ఘటాలను గ్రామాల్లో ఊరేగించనున్నామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. 14న అమ్మవారి పండగ, 15న అనుపు మహోత్సం ఉంటాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

నర్సీపట్నం ఆస్పత్రికి అంబులెన్స్ కోసం ఎన్టీపీసీ విరాళం



అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కు చెక్కు అందిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్ శర్మ

పరవాడ: నర్సీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలను మెరుగుపర్చడానికి వీలుగా అంబులెన్స్ ఏర్పాటుకు సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం రూ.35 లక్షల విరాళాన్ని ప్రకటించింది. విరాళాన్ని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) సమీర్‌శర్మ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ విజయ కృష్ణన్‌కు గురువారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ఈడీ సమీర్‌శర్మ మాట్లాడుతూ సింహాద్రి ఎన్టీపీసీ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. 2020 నుంచి మొబైల్ యూనిట్ ద్వారా మండలంలో 79 గ్రామాల్లో 75 వేల మంది ప్రజలకు ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 300 మందికి పైగా రోగులకు కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు, దాదాపు 3 వేల మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. సమాజానికి సకాలంలో వైద్య సాయం అందించడమే లక్ష్యంగా ఆస్పత్రికి అంబులెన్స్‌ను అందించామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రామాలయంలో ఉత్సవ విగ్రహాలకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న దాతలు, భక్తులు

అగనంపూడి: శ్రీరామ నవమిని పురస్కరించుకొని 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని సీతారాముల ఆలయంలో దాతలు అందించిన ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు. బీసీ కాలనీకి చెందిన విగ్రహ దాతలు గుంటూరు గణేష్‌కుమార్ రాజా, తులసి దంపతుల చేతుల మీదుగా విగ్రహాలను ఆలయంలో ఏర్పాటు చేసి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ చేసి సీతారాముల విగ్రహాలకు పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.